# ఓ అమ్మాయి తెలుసుకో!

శైలజ సాయంత్రం కాలేజీ నుండి యింటికి వచ్చేసరికి ఆమె తల్లి హాలులో కూర్చుని ఎవరో అమ్మలక్కలతో బాతాఖానీ కొట్టుతోంది. ఒకామె పిప్పళ్ళ బస్తాలాగా వుంది; మరొకామె గడకర్రకు పట్టుచీర కట్టబెట్టినట్లుగా వుంది. వీళ్ళను తనంతకు ముందెప్పుడూ చూడలేదు.

పుస్తకాలు పట్టుకుని లోపలికి వస్తోన్న తనను చూచి, "ఈ అమ్మాయి ఎవరండీ అనసూయమ్మ గారూ?" అని పిప్పళ్ళ బస్తా అడిగింది.

"మా అమ్మాయేనండీ! కాలేజీలో బియ్యే చదువుతూంది" అంది.

"శైలూ!" అని తనని పిలిచింది, తనను వాళ్ళకు పరిచయం చేయడానికి.

తనప్పటికే గది లోపలికెళ్ళి పోయింది. తల్లి పిలుపు వినిపించనట్లే!

పుస్తకాలు టేబిల్ మీద పడేసి, దానికి వాళ్ళేమంటారో విందామని తలుపు వారగా నిలబడింది.

వాళ్ళు ఏమంటారో తనకు తెలుసు - ఆశ్చర్యంగా, "మీకింత పెద్దమ్మాయి వుందండీ?" అంటారు.

ఇదే మాటను విని వినీ విసిగిపోయి వుంది తను.

తను అనుకున్నట్లే పిప్పళ్ళ బస్తా మూతిమీద వేలు వేసుకుని మరీ అడిగింది ఆశ్చర్యంగా.

"అయ్యోరామా, అంత ఆశ్చర్యపోతారేమిటండీ? ఈ అమ్మాయికంటే పెద్దవాడు ఒకడున్నాడు. కాకినాడలో బి.ఇ. ఫైనలియర్ చదువుతున్నాడు." - ఈ మాట తల్లి మామూలుగా చెప్పినా, ఏదో గర్వంగా చెప్పినట్లనిపించింది తనకు.

"ఏవిటీ, మీకు ఇంజనీరింగు చదువుతున్న అబ్బాయి కూడా వున్నాడా?" - ఈసారి గడకర్ర ఆశ్చర్యపోయింది.

"క్షమించండి అనసూయమ్మ గారూ! వీళ్ళు మీ సొంత పిల్లలేనా? అంటే మీది రెండో సమ్మంధం పెళ్ళా.... నాకు తెలియక అడుగుతున్నా. మరేం అనుకోకండి!" అంది మళ్ళీ పిప్పళ్ళ బస్తా.

దానికి తల్లి పకపకా నవ్వింది.

ఆ నవ్వులో కూడా తనకు తల్లి గర్వమే ప్రతిధ్వనించి వళ్లు మండిపోయింది.

"తెలియనివాళ్ళు అందరూ అలాగే అనుకుంటారండీ! నా పిల్లలే..." అంది అలా నవ్వుతూనే.

"మిమ్మల్ని చూస్తే ఎవరూ అలా అనుకోరు సుమండీ!"

"ఏమనుకుంటారేఁవిటీ?" ఈసారి నిజంగానే కాస్త గర్వంతోనే అడిగింది.

"క్రొత్తగా పెళ్ళయి కాపురానికొచ్చిన క్రొత్త కోడలేమో అనుకుంటారు. ఇంత పెద్ద పిల్లలున్నారంటే ఎవ్వరూ నమ్మరు!" పాపం పిప్పళ్ళ బస్తా సిన్సియర్‌గానే అంది.

నిజానికి కూడా అనసూయమ్మ అలాగే కనిపిస్తుంది. నాల్గు పదులు దాటబోతున్నా ఇంకా సల్పగా, లేతగా, రెబ్బ పాయిలాగా నాజూగ్గా కన్పిస్తుంది.

"మీ అమ్మాయికి మీ పోలిక వచ్చినట్లులేదు. మీ అమ్మాయి అంటే ఎవ్వరూ నమ్మరు. పుస్తకాలు తీసికొని లోపలికి వస్తుంటే మీ బంధువులమ్మాయేమో అనుకున్నానండీ!"

"మా అమ్మాయికి వాళ్ల నాన్నగారి పోలిక వచ్చింది. అబ్బాయిది నా పోలిక-"

ఇక తనక్కడ నిలబడలేకపోయింది. టవల్ భుజానేసుకొని విసురుగా బాత్‌రూంకేసి వెళ్ళిపోయింది.

ఖాళీ ప్లాస్టిక్ బకెట్‌లోకి పంపులోంచి నీళ్ళు పడుతుంటే వచ్చే వింత శబ్దాన్ని వింటూ బొమ్మలాగా నిలబడి పోయింది శైలజ. బొమ్మ మనస్సులో ఏవో దృశ్యాలు బొమ్మలు కట్టుతున్నాయి; నీళ్ళ శబ్దంలోంచి అప్పుడప్పుడు విన్న మాటలు "రింగ్" అవుతున్నాయి...

"ఆడవాళ్ళంతా మన అనసూయమ్మను చూచి నేర్చుకోవాలి! చీర మాయనీయదు; జుట్టు చెరగనీయదు, అవునే పిల్లా, వున్నంతలో శుభ్రంగా, పొందికగా వుండాలి!" - ఒక పేరంటంలో ఒక నిండు ముత్తయిదువ యిచ్చిన కాంప్లిమెంట్!

"అనసూయమ్మా! ఏమిటే ఎప్పుడు చూచినా నీవు శోభనపు పెళ్ళికూతురు లాగా వుంటావు; నీ కూతురు చూడబోతే ముసలిదానిలాగా వుంటుంది-" - ఒక దగ్గరి చుట్టం ఒకప్పుడన్న మాట! (అవును, వుంటాను - ముసలమ్మ లాగే వుంటాను! మధ్యలో వీళ్ళకేంటి బాధ! నా బదులూ తనబదులూ తనే తగుదునమ్మా అని పెళ్ళికూతురులాగా ముస్తాబయి కూర్చుంటుందిగా? ఇంక తనెలా వుంటేనేం?)

-"మీ పిల్లలెవరూ కనిపించరేమండీ? ఆడుకుంటానికెళ్ళారా? ఈ అమ్మాయి ఎవరు? మీ ఆడబిడ్డా?" - ఈ వీధిలోకి క్రొత్తగా అద్దెకొచ్చిన తాసీల్దారు గారి భార్యామణి పేరంటానికి పిలవటానికొచ్చి బొట్టుపెడుతూ అన్నమాట ఇది! (అవును, నేను ఈ అందాల బొమ్మగారి ఆడబిడ్డను! అసలు మాట్లాడితే ఈవిడగారి అత్తగార్ని! మీకేంటి?.... అందుకేగా ఈవిడతో కలిసి ఈ పేరంటాళ్ళకూ, పెళ్ళిళ్ళకూ వెళ్లటం మానుకున్నది!)

.... బకెట్ నిండిపోయి నీళ్ళు పొర్లిపోతున్నాయి. బొమ్మలోకి జీవం వచ్చింది; ఈ లోకంలోకి వచ్చింది. గాఢంగా నిట్టూర్చి స్నానానికి వుపక్రమించింది.

స్నానం పూర్తి చేసుకొని లోపలికి వచ్చేసరికి పిప్పళ్ళ బస్తా, గడకర్రా వెళ్ళిపోయారు.

తను ఏదో ఆలోచిస్తూ, అనాసక్తిగా, మనస్సెక్కడో పెట్టుకుని జడల్లుకుంటుండగా తల్లి వచ్చింది.

"ఏఁవిటా జడల్లుకోవడం శైలూ! చక్కగా నేనేస్తా ఇలారా! కాలేజీలో బి.ఏ. చదువుకుంటున్న పిల్ల వుండే తీరు ఇదేనా? యింటికి వాళ్ళూ వీళ్ళూ వస్తుంటారు కదా, కాస్త నీట్‌గా వుండకపోతే ఎట్లాగే తల్లీ? ఎంతసేపూ నీ చదువు ధ్యాసేనా?' అంది.

"ఏం నీకూతురునని చెప్పుకోవడానికి నీకు తలవంపులుగా వుందా?" ఉక్రోషంగా, దురుసుగా అని విసురుగా తన స్టడీ రూంలోకి వెళ్ళిపోయింది.

పాపం, అనసూయమ్మ విస్తుపోయి చూస్తూండిపోయింది. ఈ పిల్లేంటో, ఈ పద్ధతి ఏంటో అర్థం కాకుండా వుందని దీర్ఘంగా నిట్టూర్చింది.

- క్లాసు పుస్తకం తీసిందన్న మాటే గాని శైలజకు మనస్సు దానిమీదకు పోవటం లేదు. అమ్మ మీద కసి.... తన మీద తనకు కసి. అందరిమీదా కసి... ఇదేంటి, తన కళ్లు వూరికే చెమ్మగిల్లుతూన్నాయి; ఎందుకో గుండెలు బరువెక్కుతోన్నాయి. కరువుతీరా ఏడిస్తేగాని ఈ బరువు తగ్గేటట్లు లేదు!

మనస్సు ఇలా బరువెక్కినప్పుడు ఆ వీధిలో వున్న ఆంజనేయస్వామి కోవిలకెళ్ళి కాసేపు కూర్చుంటే తేలికవుతుంది.

పుస్తకం ప్రక్కన పడేసి లేచింది.

తల్లికి చెప్పుదామని వంటింటి గుమ్మందాకా వెళ్ళింది. మళ్ళీ మనస్కరించలేదు. వెనక్కి వచ్చేసింది.

గుళ్ళో వున్న ఆ కాసేపు ఏదో శాంతి; గుండెలు సేదతీరినట్లుగా వుంటుంది.

ఇవ్వాళ తను ఈ కాసేపు శాంతికి కూడా నోచుకున్నట్లు లేదు.

గుళ్ళో గుమ్మడికాయంత బంగారంతో చేయించుకున్న నగలు దిగేసుకున్న ఒక కోమటామె కనిపించింది. ఆమె అప్పుడప్పుడు గుళ్లో తననీ, తల్లినీ చూస్తుంటుంది.

ఏదో పని వున్నదానిలాగా పలకరించి, "మీ అక్కయ్య రాలేదే?" అని అడిగింది.

"ఆమె మా అక్కయ్య కాదు, మా చెల్లెలు!" అని పెడసరంగా అంది తను. ఆమె నోరెళ్ళపెట్టుకుని చూస్తూండిపోయింది.

మరో క్షణం కూడా అక్కడ కూర్చోలేకపోయింది.

దారిలో అరుణా వాళ్ళింటి ముందుకొచ్చేసరికి అప్రయత్నంగా తన కాళ్ళు ఆగిపోయాయి. అరుణ వారం పది రోజుల్నుంచి కాలేజీకి రావటం లేదు. అక్కయ్యకు జ్వరమని వాళ్ళ చెల్లెలు కరుణ కాలేజీలో కనిపించి చెప్పింది; ఒకసారి వచ్చి చూచి వెళ్ళమని అరుణ కబురు పంపింది.

అరుణ తనకు ఆప్తమిత్రురాలు. స్కూలు నుంచి కలసి చదువుకున్నారు. అలాంటి అరుణతో రెండు నెలలుగా తాను మాట్లాడటం లేదు. ఆరోజు అరుణ మామూలుగా ఏదో నోట్స్ కోసం వచ్చింది. అప్పుడు అనసూయమ్మ ఏదో పెళ్ళికెళ్ళటానికి ముస్తాబవుతూంది.

"మీ అమ్మ ఇంత స్లిమ్‌గా వుంటుంది. యోగాసనాలు గానీ వేస్తుందా ఏమిటే శైలూ!" అని అడిగింది.

తనకు వళ్ళు మండుకొచ్చింది. "ఏం, నీక్కూడా నేర్పుతుంది. నేర్చుకుంటావా?" అని కోపంగా అంది. అరుణ నవ్వి, "కాదే, మన చిన్నప్పట్నుంచీ చూస్తోన్నానుగా, మీ అమ్మ గారు అప్పటికీ ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఇలాగే స్లిమ్‌గా వున్నారు. మా చిన్నక్కయ్యకు నిరుడేగా పెళ్ళయింది. ఒక్క ఇష్యూకే

డొక్కయిపోయింది. చూస్తానికి నాకే రోతగా వుంది-'' ఆ కాంప్లిమెంటుకు తనేదో మురిసిపోతాననుకుంది. కాని, తన మనోవైచిత్రి దానికేం తెల్సు? అంతే, మర్నాట్నుంచి అరుణతో మాట్లాడటం మానేస్తేగాని తన మనస్సు వూరడిల్లలేదు. ఆనాటి సంఘటన గుర్తుకు వచ్చింది.

లోపలికెళ్ళి జ్వరంతో మంచమెక్కిన స్నేహితురాలిని పలకరించటానికి మనస్సు మొరాయించింది. గిరుక్కున వెనక్కి తిరిగి వచ్చింది.

ఆ రాత్రి భోజనాల దగ్గర తనూ అమ్మా ముభావంగా వుండటం గమనించి నాన్నగారు నవ్వుతూ, "అమ్మా కూతుళ్ళు పోట్లాడుకున్నారా?'' అని అన్నారు.

"అమ్మా కూతుళ్ళూ'' కాదు సార్, "వదినా ఆడబిడ్డలూ'' లేక "కోడలూ అత్తా'' అనండి! మీ ముద్దుల భార్య సంబరపడిపోతుంది అని అందామనుకుంది. కాని, అన్నం కంచంలో గీతలు గీస్తూ కూర్చుండిపోయింది....

మర్నాడు నిద్ర పక్క మీద నుంచి లేవటమే నేరుగా వంటింట్లోకెళ్ళి తల్లితో మాటలు మెల్లగా కలిపింది.

కాని, తన కర్మానికి ఒక్క గంటలోనే అనుకోకుండా సుబ్బులు పిన్నీ వాళ్ళు తిరుపతి నుండి తిరిగి వెళ్ళుతూ ఇక్కడ దిగేరు. పిన్ని అంటే - తన తల్లికి రెండోదీ - కడగొట్టుదీ అయిన సొంత చెల్లెలు. అవటానికి అమ్మకంటే పదేళ్ళు చిన్నదయినా, ఇద్దరు పిల్లలకే లావెక్కిపోయి, చూట్టాని కసహ్యంగా వుంది. తనకు అమ్మమ్మ అవుతుందంటే ఎవరన్నా యిట్టే నమ్మేస్తారు... పైగా ఆమెకు బోలెడు బడాయి. హైదరాబాదులో వుంటున్నావిడ కదా, ఆ అవతారానికి తోడు బోలుడు ఫ్యాషన్స్!

వున్న నాలుగు రోజులూ సుబ్బులు పిన్నికి తన తల్లిని వుబ్బేయటంతోనే సరిపోయింది. "అక్కయ్యా, నీలాగా వుండాలంటే ఏం చెయ్యాలో చెప్పవే!'' అని. "ఏవే అమ్మడూ, అమ్మ ఏం చేస్తుందే ఇలా నాజూగ్గా వుండటానికి?'' మళ్ళీ తనని అడుగుతుంది. తనకేమో వంటికి ఆవకాయ కారం రాసుకున్నట్లుంటుంది. వళ్ళు చిత్రిక పట్టించుకోమని అందామని నోటిదాక వచ్చేది. "అందరూ ఆమెను మెచ్చుకునే వాళ్ళే!'' అనుకుని విసురుగా అక్కణ్ణుంచి గది లోకి వెళ్ళిపోయేది.

ఈ బాబాయి ఒకడూ - వెధవ గుండూ, మెల్లకన్నూ! అటు వచ్చీ ఇటు వచ్చీ గుటకలు మ్రింగుతూ అమ్మ వంక దొంగ చూపులు చూస్తాడు. తనకు వీళ్ళున్న ఆ నాలుగురోజులూ యింట్లో వుండాలంటేనే ప్రాణం మీదకు వచ్చేది. ఎప్పుడు వెళ్ళిపోతారా అని అనిపించేది.

వున్న నాలుగు రోజులూ తన తల్లిని వుబ్బేసి, మూడొందలు పట్టుచీర పెట్టించుకుని పోయింది. రిక్షాలు కదలగానే "అమ్మయ్య!'' అనుకుంది తాను.

కాని, పిన్ని రాక తన గుండెల్లో కనిపించని గాయాలను మరీ ఎక్కువ చేశాయని ఆ తర్వాత గానీ తెల్సుకోలేక పోయింది.

సుబ్బులు పిన్ని వెళ్ళుతూ వెళ్ళుతూ తనకు పట్టని క్రొత్త పట్టు జాకెట్స్ తన తల్లికిచ్చిపోయింది. అవి హైదరాబాదులో కుట్టిన ఫ్యాషన్‌బుల్ జాకెట్స్ - పైకి పోయిన చేతులూ, క్రిందకు దిగిన మెడా, షేపులూన్నూ!

చెల్లెలు వెళ్ళిన తర్వాత వచ్చిన ఒక శుక్రవారం సాయంత్రం అనసూయమ్మ స్నానమది తీరిగ్గా కూర్చుని ఆ జాకెట్స్‌లో నీలపు రంగుది ఎలా వుంటుందో చూద్దామని వేసుకుంది. సవరం బర్మా ముడి వేసుకుంది. దొడ్లో కాసిన గులాబీ పువ్వును ప్రక్కగా పెట్టుకుని అద్దంలో చూచుకు జాకెట్ చేతులు మరీ కురచగా వున్నట్లనిపించాయి. జబ్బల మీద క్రింద నల్ల అరా, పైన పచ్చటి - గమ్మత్తుగా వుంది. మెడ ఎలా వుందోనని ముందుకూ వెనక్కి తిరుగుతూ నిలువుటద్దం చూచుకుంటోంది.

తన గదిలో టేబిల్ ముందు కూర్చుని చదువుకుంటూ ఇదంతా ఓరకంట గమనిస్తోంది శై మనస్సులోనే తల్లి అందాన్ని ఒక్క క్షణమో, అరక్షణమో మెచ్చుకుందో లేదో, మళ్ళీ అంతలోనే, సిగ్గులేకపోతే సరి! ఆవిడగారు యిచ్చింది ఇంతే చాలని ఆ బొమ్మ రెవిక వేసుకుని కులుకుతోం అనుకుంది. అలా అనుకుంటేగాని మనస్సుకు సుఖంగా లేదు మరి!

సరిగ్గా అప్పుడే, "మరీ ఎబ్బెట్టుగా వుందేమో!" విప్పేద్దామనుకుంటోంది అనసూయమ్మ.

సరిగ్గా అప్పుడే ఆమె భర్త శ్రీహరి రావు ఆఫీసు నుండి వచ్చాడు. గుమ్మంలో నిలబడిపోయి, అ ముందు నిలబడి, క్రొత్తగా, మళ్ళీ మెరుగు పెట్టిన బంగారు బొమ్మలాగా వున్న భార్యను చూ మురిసిపోయాడు.

"ఏంటోయ్, ఇవ్వాళ భలే గమ్మత్తుగా వున్నావు?" "అబ్బ, భలే తమాషాగా వున్నావోయ్!" అంటు ముందుకు వచ్చాడు. సందెట్లోకి విసురుగా లాక్కొని, చేతులు బిగించి, వెనక్కి మళ్ళించుకొని పచ్చ మెడకేసి తన మొగాన్ని రుద్దుకుంటూ, "అబ్బ! కొబ్బరి ముక్కలాగా వుందోయ్! కోవా బిళ్ళ లా వుందోయ్! కొరుక్కొని తినేయాలనిపిస్తోందోయ్!" అని అంటున్నాడు.

"ఛీ, ఏంటది! వదలండీ - అమ్మాయి యింట్లోనే వుంది!" అని అంటూ వదిలించుకోవడాని అనసూయమ్మ గింజుకొంటోంది.

ఇదంతా గదిలోంచి శైలజ వింటూనే వుంది; వోరకంట చూస్తోనే వుంది.

అనసూయమ్మ జాకెట్ విప్పేయటానికి మరో గదిలోకి వెళ్ళబోతుంటే శ్రీహరిరావు వద్ద వారించాడు. "అమ్మాయికి చూపిద్దాం రా, ఏమంటుందో!" అని చెయ్యిపట్టుకుని తన గదిలో లాక్కొచ్చాడు.

"చూడమ్మాయి, ఈ జాకెట్ మీ అమ్మకు బాగాలేదూ!" అని అడిగేడు.

తనేం అంటుంది? ఏడ్పులాంటి నవ్వు ఒకటి నవ్వింది.

"మీ యిద్దరూ వెళ్ళి ఆ కృష్ణలో దూకండి!" అని మనస్సులోనే కసిగా అనుకుంది.

మర్నాడు మరో విశేషం తన కంట పడింది.

తల్లి రోజా రంగు పుల్‌వాయిల్ జాకెట్ తొడిగింది. అది విశేషం కాదు. ఎప్పుడే వేసేదే. కాని విశేషమేమిటంటే - దాని క్రింద నుంచి పచ్చటి వీపును గట్టిగా, బిగుతుగా చుట్టుకుని వున్న బ్రాస కనిపించడం. అయితే ఈవిడగారు బ్రాసరీలు కూడా వేస్తోందన్నమాట! ఇవి కూడ పిన్నే యిచ్చి పోయిందో, లేక తమ అందాల భార్య కోసం నాన్నగారే మోజుపడి తీసికొచ్చారో?

ఆరోజే శైలజ ఆ వీధిలో వుంటున్న మిషన్ కుట్టే జానికమ్మ దగ్గరకెళ్ళి - "కాలేజీలో బియ్యే చదువుకుంటున్న దానివి, ఈ పాతకాలపు బాడీలు నీకెందుకమ్మా?" అని ఆమె అంటున్నా వినకుండా

ఆ "పాతకాలపు" బాడీలే కుట్టించుకుంది. తల్లి రౌండ్ నెక్ జాకెట్ తొడిగితే బాగుందని మెచ్చుకుని తండ్రి తెగ మురిసిపోయాడు కాబట్టి, తను కావాలని పూర్వకాలపు ముసలమ్మల "కంఠె మెడ" రెవికలు కుట్టించుకుంది. అంతకు ముందు తనకున్న బ్రాసరీలూ, రౌండ్ నెక్ జాకెట్లూ పాత గుడ్డల మూటలో కట్టి అవతల పడేసింది. ఈ పాతకాలపు "బాడీలూ", "కంఠెమెడ" రెవికలూ చూచి, "కాలేజీలో చదువుకుంటున్నదానికి ఈ ముసలమ్మ వేషాలేంటే శైలూ! వున్నకొద్దీ మతి పోతున్నట్లుందే!" అని తల్లి విసుక్కున్నది.

"అవును, నేను ముసలమ్మనే! నీవున్నావుగా పడుచమ్మవు. నా యిష్టము వచ్చినట్లు వుంటా. మధ్యలో నీకేంటి బాధ?" పెడసరంగా అని విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

అప్పట్నుంచి పెద్ద పమిట తీసుకుని భుజాల చుట్టు కప్పుకుని, గూడలు బిగపట్టుకుని నడవటం అలవాటు చేసుకుంది. స్నోలూ, పౌడర్లూ, కాటుకా వాడడం మానేసింది. పూలకు ఆమడదూరంలో వుంటుంది. అంతకు ముందు చేతులకు వున్న బంగారు గాజులు తీసేసింది; మెళ్ళో గొలుసు తీసేసింది. బోసి మెడతో, బోసి చేతులతో వుంటున్నది. ఇలా వున్న వయస్సుకంటే ఎక్కువ వయస్సు దానిలాగా కనిపించటానికి ఏవేవి మార్గాలున్నాయో ఆలోచించి వాటిని అలవాటు చేసుకోవటం మొదలు పెట్టింది. తనకు త్వరగా సైట్ వస్తే బాగుణ్ణు. ఒక కళ్ళజోడు కూడా పెట్టుకోవచ్చుననుకుంది. ఇలా తనమీద తనే కసి పెంచుకోవటం తన "వే ఆఫ్ లైఫ్"గా అలవాటు చేసుకుంది. అందులో తనకొక మానసికానందం లభ్యమౌతున్నట్లుగా ఫీల్ అవుతూ వచ్చింది.

పద్దెనిమిదేళ్ళు కూడా నిండని కూతురు యొక్క ఈ పద్ధతులు చూచి అనసూయమ్మ విస్తుపోతోంది. కూతురు మనస్సులో ఏముందో తెలియక ఆ తల్లి తల్లడిల్లిపోతోంది.

కూతురు తనని చులకన చేసి, కూరాకులో పురుగును తీసేసినట్లు తీసిపారేస్తున్నందుకు, కట్టె విరిచి పొయ్యిలో పెట్టినట్లు పెడసరంగా మాట్లాడుతున్నందుకు తనకు బాధ లేదు. తన బాధల్లా - నవ్వుతూ త్రుళ్ళుతూ, షోగ్గా ఈ కాలపు ఆడపిల్లలులాగా తన కూతురు వుండటం లేదనే!

ఇదే విషయం భర్తతో అంటే ఆయన నవ్వేసి, "ఈరోజుల్లో ఇలా సింపుల్‌గా, మూడీగా వుండటం ఇదొక మోడరన్ టైప్ లేవోయ్!" అని తీసి పారేస్తారు.

"కాదండి, అమ్మాయి ఎందుకో తనలో తనే బాధపడుతోందండీ!" అని అంటే - "నీ మొగం, పరీక్షలు దగ్గరికొస్తున్నాయి కదా సీరియస్‌గా చదువుకొంటోంది. చదువుకోనీయ్!" అని అంటారు. తాను మాత్రం అంత తేలిగ్గా తీసికోలేక, కూతురు తత్త్వం అర్థంకాక తనలో తాను సతమతమౌతోంది పాపం ఆ తల్లి!

శైలజ చదువులో వస్తుత: బ్రిలియంట్. పైగా, తనమీద పెంచుకున్న కసీ, తన మనస్సు తనకేసిన శిక్షా - అందువల్ల మనస్సంతా చదువు మీద కేంద్రీకరించి చదివి పరీక్షలు రాసింది.

పరీక్షలు రాసి శైలజ అన్నయ్య మోహన్ కూడా వచ్చాడు. అతను వచ్చిన నాలుగు రోజుల వరకు అతనితో కబుర్లాడుతూ సరదాగా గడిపేసింది. "కనీసం అన్నతో అయినా సరదాగా వుంటోంది, పోనీలే" అనుకుంది అనసూయమ్మ.

కాని అదీ నాలుగు రోజులు సరదాగానే మిగిలిపోయింది!

ఆరోజు ఏమయిందంటే -

మోహన్ తల్లిని వెంటపెట్టుకుని గుడికెళ్ళాడు. శైలజ యింట్లోనే వుండి పోయింది - తల్లి వెంట వెళ్ళటం యిష్టం లేక. ఆ పూట వంట తనే చేస్తోంది. ఇంతలో హాలులోంచి నవ్వులు వినిపించాయి. మోహన్ నవ్వుతూ ఏదో చెప్తున్నాడు. తండ్రి నవ్వుకూడ వినిపిస్తోంది. అంత నవ్వు వచ్చే విశేషం ఏమిటబ్బా అనుకుంది. వంట పని పూర్తి చేసుకుని చేతులు తుడుచుకుంటూ హాలులోకి వచ్చింది.

తనను చూచిన మోహన్, "రావే చెల్లాయి, ఇందాక మేం వస్తోంటే భలే తమాషా జరిగింది-" అన్నాడు.

"ఏమిటంత తమాషా." నవ్వుతూ తను సోఫాలో కూర్చుంది.

ఇంతకీ అతగాడు చెప్పిందేమిటంటే - తల్లీ తనూ వస్తోంటే బజార్లో తన స్నేహితుడు కలిశాడట. అమ్మను చూచి, "ఎవరీమె మీ సిస్టరా?" అని అన్నాడట. తను అవునన్నాడట. తీరా వచ్చేసేముందు మా సిస్టర్ కాదు, మా అమ్మగారన్నాడట. దానికి ఆ ఫ్రెండ్ ఆశ్చర్యపోయాడట - అదీ సంగతి! దానికి చెప్పలేక "వో" ఇదయిపోతున్నాడు. దీనికే నవ్వలేక పోతున్నారు. తండ్రి గొప్పగా కులుక్కుంటున్నాడు. తల్లి కన్నెపిల్లలాగా సిగ్గులు పోతోంది... ఛీ ఛీ అనుకుంది.

శైలజకు ఈ "తమాషా" వినగానే మొగంలో రంగులు మారాయి; నవ్వు మొగంలోకే ఇంకిపోయింది. గుండె కుదుళ్ళలోంచి దు:ఖం పైకి తన్నుకొచ్చింది. చివాల్న లేచి, తన గదిలోకి వెళ్ళిపోయింది. తండ్రి, "అరె, వెళ్ళిపోతున్నావేంటీ శైలూ?" అన్నాడు. కాస్త తలనొప్పిగా వుంది అంది.

ఆ రాత్రి ఎవరు ఎంత బ్రతిమిలాడినా భోజనం చెయ్యలేదు. మర్నాటి నుంచి తన అన్నయ్యతో కూడ మాట్లాడటం మానేసింది. యింట్లో అందరితో ముభావంగా వుంటోంది. కాలేజీ లైబ్రరీ పుస్తకాలతోనే కాలక్షేపం చేస్తోంది. మోహన్ కావాలని గదిలోకి వెళ్ళి మాట్లాడిస్తే ఏదో గిల్లికజ్జం పెట్టుకుంటుంది.

శ్రీహరిరావుకు కూతురు ప్రవర్తన వింతగానే కనిపించింది. భార్య చెప్పితే అప్పట్లో ఏదో అన్నాడు గాని, మొత్తానికి ఇదేదో ఆలోచించవలసిన విషయం లాగే వుందనుకున్నాడు.

ఇంతలో రిజల్టు వచ్చాయి. యిద్దరూ ఫస్టు క్లాస్‌లో పాసయ్యారు. మరో వారం తర్వాత శైలజ ఫస్టు క్లాసులో పాసవటమే కాదు యూనివర్శిటీకే ఫస్టు వచ్చిందని తెల్సింది. అందరూ సంతోషించారు. శైలజ భావాలేమిటో ఎవరికీ తెలియదు.

శైలజ తన చిన్ననాటి స్నేహితురాలయిన అరుణతో కూడ మాట్లాడటం లేదన్న విషయం శ్రీనివాసరావుకు ఆ ఉదయమే తెల్సింది. ఆ సాయంత్రం ఆఫీసు నుండి రాగానే కూతురు గదిలోకి వెళ్ళాడు. శైలజ పుస్తకం చేతిలో పట్టుకుని కూర్చుంది. కాని, ఆలోచనలు మాత్రం ఎక్కడో వున్నాయి.

"శైలూ! అలా డాబామీద కూర్చుందాం వస్తావా?" అన్నాడు.

మారు మాట్లాడకుండా డాబా ఎక్కింది.

శ్రీహరిరావు లుంగీ కట్టుకుని రెండు గ్లాసులతో కాఫీ తీసికొని, సిగరెట్టు పెట్టె తీసికొని డాబామీద కెళ్ళాడు.

.... శ్రీహరి రావు క్రిందకు దిగివచ్చేసరికి రాత్రి ఏడుగంటలు దాటింది. అనసూయమ్మ వంట చేసేసి, స్నానం చేసి, పూలు గ్రుచ్చుతూ కూర్చుంది.

"తండ్రీ కూతుళ్ళ మంతనాలు అయ్యాయా? అమ్మాయి ఏది?" నవ్వుతూ అంది.

"బ్రెయిన్ వాష్ అయిందిగా. ఇంకో గంటకు గానీ క్రిందకు దిగిరాదు". అని టవల్ తీసికొని స్నానం చెయ్యటానికి బాత్‌రూం కేసి వెళ్ళాడు.

శైలజ పైకి చూస్తో డాబామీద పడుకుంది. ఆకాశంలో మిలమిల మెరుస్తోన్న నక్షత్రాలను చూస్తూ ఆలోచిస్తోంది. చంద్రుడంత పెద్దగా, ప్రకాశంగా లేవని తారకలు తమ వునికే నిరర్ధకమనుకుంటున్నాయా? నిజానికి ఎంత పెద్ద చంద్రుడు వుంటేనేం - చుక్కలు లేని ఆకాశం బోసిగా ఏం బాగుంటుంది? ఒక విధంగా చూస్తే, ఎప్పుడో వచ్చి ఎప్పుడో పోయే నిలకడ లేని ఈ చంద్రుని కంటే చీకటి పడగానే గుండె గూటిలో దీపాలు వెలిగించుకునే ఈ చిన్ని చిన్ని చుక్కలే మేలు! చంద్రుని రాహువు మ్రింగిన రాత్రి కూడ ఇలా నిశ్చలంగా నిండుగా వుంటాయి! ఇలా చూస్తే చుక్కలే గొప్పవి.... నాన్నగారన్నట్లు ప్రతి మనిషిలోనూ ఏదో ఒక టేలెంట్ వుంటుంది. భగవంతుని సృష్టిలో ప్రతి ప్రాణికి ఒక "పర్‌పస్" వుంటుంది. తనలోని టేలెంట్‌ను వుపయోగించుకుని ఆ పర్‌పస్‌ను పూర్తి చెయ్యటమే జీవితానికి అర్థం... నాన్నగారు జీవితాన్ని ఎంత చక్కగా ఎనలైజ్ చేశారు!

నిజంగా చూస్తే అమ్మకంటే తనెంత గొప్పది! అమ్మలో కేవలం అందం మాత్రమే వుంది. అదీ నాలుగురోజులు పోతే వన్నె తరిగిపోయే అందం! తనలో అపారమైన విద్యాతృష్ణ వుంది; రోజులు గడిచిన కొద్దీ పెరిగే మేధస్సు వుంది. తను యూనివర్సిటీకే ఫస్టు వచ్చింది. అమ్మ పదో క్లాసు కూడా పూర్తిగా చదివిందో లేదో! తనిక తనలో లేని దానికోసం కుమిలిపోదు; ఇతరుల్లో అది వుంది కదా అని జెలసీతో కుళ్ళిపోదు. తనలో వున్న విద్యా సంపత్తును పెంచుకుంటుంది. ఎం.ఏ. చదువుతుంది. పి.హెచ్.డి. చేస్తుంది ...

- అబ్బ, ఇలా ఆలోచిస్తోంటే గుండెల్లో బరువు మెల్లమెల్లగా కరిగిపోతూంది. ఎక్కడ్నుంచో ఏదో 'బలం' మెల్లమెల్లగా తన పిచ్చి మనస్సులోకి బేలగుండెల్లోకి ప్రాకుతూ వస్తోంది! అమ్మకంటే, మరింకెవరికంటే తను తక్కువది?

శైలజ లేచి నిలబడింది. నిటారుగా నిలబడింది. బిగపట్టిన గూడలు సళ్ళిచ్చాయి. పమిటను భుజం మీదుగా జారేటట్లు వేసుకుంది.

ఇవ్వాళ రాత్రి అమ్మ పక్కలో తన చిన్నప్పటిలాగా ఆమె మెడను వాటేసుకుని పండుకోవాలనుకుంది.

రేపు అరుణా వాళ్ళింటికెళ్ళాలనుకుంటూ మెట్లు దిగింది.

*- 'యువ' మాసపత్రిక - 1977*

★